మంచమీదినుంచి లేచాడు. గబగబా పార్వతిని వెతుకుతూ లోపలకు వెళ్ళాడు. పార్వతి చాప మీద కూర్చుని నాన్నగారి పాంతరికార్డులు తిరగేస్తున్నది.

"మీ నాన్నగారియిల్లు - ఒకరికి తెలీకుండా మరొకరికి ముగ్గురి తాకట్టులో వున్నది."

పార్వతి బావవంక చూసింది.

"ఎవరన్నారు?"

"ఎవరో ఎందుకంటారు? ఆ ముగ్గురూ నాకు తాకట్టు దస్తావేజులు చూపించారు."

"నేను నమ్మను."

"నేను నమ్మాను."

"అయితే నన్నేం చెయ్యమంటారు?"

"ఇక్కడుండటానికి వీల్లేదు. ఇక్కడుండి చెయ్యగలిగిందీ ఏమీలేదు. మాతోపాటు మా యింటికి రావాలి. అదీ నీ సొంతయిల్లే."

పార్వతి వెక్కి-వెక్కి ఏడ్చింది.

"బావా! నీ పెళ్ళికి తెగిపోయిన పూలదండలు కట్టినదాన్ని. నన్ను ఆహ్వానిస్తున్నావా?"

పాము కాటువలె యీ పూలదండమాటకు వివేక్ ఒక్క అడుగు వెనుకకు వెళ్ళాడు. అతని కళ్ళు చీకట్లుకమ్మినవి. మెదడు అర్థం గమ్యంలేని అరాచకవేగంతో పరుగులుతీసింది. ఆనాటి పూల దండ నాగుబాములె పడగలెత్తి అతని కళ్ళముందు ఫణంవిప్పి ఆడసాగింది. నాగస్వరం వూదుతున్న పాములవాడివలె పార్వతి కూర్చునివున్నది. అతడు యీ భ్రమనుండి బయటపడేసరికి ఎంతకాలమైందో వూహించలేదు.

"నీ బట్టలన్నీ మీ అక్క సర్దుతున్నది. ఇవ్వాళ సాయంత్రమే మన ప్రయాణం" అని వివేక్ అక్కడి నుండి కదిలిపోయాడు.

(ఇంకా వుంది)

స్కెచ్

# దేవుడిచ్చిన వరం

## దుత్తా దుర్గాప్రసాద్

మూడేళ్ళనుండి వర్షాల్లేక పంటలు పండటం లేదు. నీటిబొట్టుకి మొహం వాచిపోయున్నారు జనం. ఊళ్ళో ఎక్కడచూచినా దారిద్ర్యం తాండవిస్తోంది. దొంగతనాలూ, దౌర్జన్యాలూ పెరిగిపోతున్నాయి. గుప్పిట్లో ప్రాణాలన్నీ పెట్టుకు బ్రతుకుతున్నారు ప్రజలు.

ఏడాది సవ్యంగా వర్షం పడింది. నిరాశా నిస్పృహల్లో మునిగిఉన్న రైతులంతా ఒక్కసారిగా, హుషారుగా నవ్వారు. అంబలైనా దొరకక, అంటుకుపోయిన డొక్కల్లో పడివున్న కూలీలు ఒక్కసారిగా ఒళ్ళు విరుచుకొన్నారు. ఊళ్ళో ఎక్కడచూచినా ఆనందం అలముకుపోయి ఉంది. అణగారిన ఆశలన్నీ మేల్కొనడంతో దేవుడిమీద అపారమైన భక్తి ఏర్పడిపోతోంది ప్రజల్లో.

అలాంటి వారణంలో—అంటే సరిగ్గా ఇరవై సంవత్సరాలక్రితం, ఐనాపురంలో ఒకనాటి సాయంకాలం, మసకమసకగా ఉంది, ఇంకా చీకటి పడలేదు. అప్పయ్యనాయుడిగారి అరుగుమీద నాయుడుగారూ, ఆచార్యులుగారూ, రంగయ్యశెట్టీ, ఏదో మాట్లాడుకొంటూండగా, నాయుడిగారి పాలేరు వెంకడు, యింటిముందు గడ్డి బండి తీసుకొచ్చి ఆపాడు. నలుగురూ కలిసి బండిమీది గడ్డి తొలిగించి ఓ పెద్దమూట కష్టంతో దించి, లోపలికి మోసుకెళ్ళారు. ఇదంతా చింతచెట్టు మీద కోతీ కొమ్మచ్చి ఆడుకొంటున్న నలుగురు కుర్రాళ్ళు చూచారు. వాళ్ళకేదో తమాషాగా తోచింది కాబోలు. నలుగురూ వచ్చి నాయుడిగారి వాకిట్లో నిలబడి లోపలకి తొంగిచూస్తుంటారు. ఇంతలో రంగయ్యశెట్టి బయటికొస్తూ వీళ్ళనిచూసి గాభరాగా "ఎందుకబ్బాయ్, ఇక్కడ నించున్నారూ? ఎంతసేపైంది మీరొచ్చి?" అని

అడిగి ఏదో ఆలోచించుకొని లోపలికెళ్ళి తలో గుప్పెడు సెనగపప్పు తెచ్చిపెట్టి "ఆ మూటనిండా సెనగపప్పు వచ్చిసై రేపురాండి ఇంకా పెడతాను" అన్నాడు. పిల్లలు అవి తింటూ కేరింతలుకొడుతూ వెళ్ళిపోయారు.

మనిషికి ఎలాంటి దుర్గుణాలబ్బితే సర్వనాశనమైపోతాడో అవన్నీ అలవరుచుకొని, తండ్రి అప్పగించిన, మూడుతరాలవరకూ కూర్చుని తిన గలిగిన ఆస్తంతా, కర్పూరంలా హరించిపోగా మిగిలిపోయిన మూడెకరాల పొలం, తరాలనాటి యిల్లూ, దాని చుట్టూ రెండెకరాల పెద్ద దొడ్డీ-వీటితో జీవితమంతా ఎలా గడపాలా అని తలపగల కొట్టుకొంటున్న ఘటికుడుఅప్పయ్యనాయుడుగారు.

"డబ్బు సంపాదించడానికి ఎలాంటి పనిచేసినా ఫరవాలేదు" అనే మనస్తత్వంతో లక్ష దాకా గడించి, ప్రస్తుతం ఊళ్ళో క్షామం తాండవిస్తూన్నందున, వ్యాపారం సాగక గోళ్ల గిల్లుకొంటూ కూర్చున్న ఘనుడు రంగయ్య శ్రేష్ఠి.

క్షామదేవత క్రూర నృత్యానికీ, అరడజను పిల్లల్ని వెంటేసుకొని రోజూ భార్య తనమీద జరిపే "సాయుధ" సమరానికీ, తట్టుకోలేక జీవితంమీద విరక్తిచెంది, అటోయిటో తేల్చుకోలేక, చావు బ్రతుకుల పొలిమేరల్లో విహరిస్తున్న, అపర కుచేలుడు ఆచార్యులుగారు.

* * *

ఆ మరునాడు కరణంగారింటిముందు పెద్దలంతా పేకాట ఆడుకొంటూంటారు. పాలేరు వెంకడు నాయుడుగారిని పిలవడానికివచ్చి అక్కడ నిలబడివుండగా, అమాంతం దేవుడు అతన్ని ఆవహించి తాను అప్పయ్యనాయుడిగారింట్లో వెలిశాననీ, జాగ్రత్తగా ఆలయమూ, అదీ కట్టించక పోతే ఊరంతా సర్వనాశనం చేస్తాననీ అరిచాడు. వెంటనే కరణంగారూ, నాయుడిగారి దొడ్డంతా, వెతికారు. ఓ మూలగా జిల్లేడుచెట్ల చాటున దాక్కొని ఉన్నాడు దేవుడు! తక్షణం ఊరు ఊరంతా అక్కడచేరిపోయింది. వెంటనే చందాలు వేసుకొన్నారు. అప్పయ్యనాయుడుగారు స్థలం ఊరికే యిస్తానన్నారు "అయితే రేపే మంచిది" అన్నాడు ఆచార్యులుగారు. "నా వంతు ఐదు వేలు వేసుకో" మన్నాడు రంగయ్య శ్రేష్ఠి. ముక్కుమీద వేలు వేసుకొన్నారు జనమంతా.

ఊరికి దరిద్రదశ వదలిపోయిందనీ మంచి రోజులు వస్తున్నాయనీ, అందుకు యీ వర్షాలూ, యీ దేవుడు వెలియడం, సూచనలనీ చెప్పాడు ఆచార్యులుగారు.అప్పలనాయుడుగారు ధర్మకర్తలుగానూ, ఆచార్యులుగారు అర్చకులుగానూ, ఏకగ్రీవంగా నిర్ణయించబడ్డారు.

మన్నాడు నాయుడిగారి పాలేరు, వెంకడు భోజనంచేసి పడుకొన్నవాడు పడుకొన్నట్టే చనిపోయాడు. అదృష్టమైన చావు అన్నారంతా! అప్పయ్యనాయుడుగారు చాలా విచారించారు. వెంటనే రెండు వందలు ఖర్చుపెట్టి సమాధికట్టించి. అంత్యక్రియలు కూడా చేయించారు.

అనుకొన్నదానికి అయిదింతలు ప్రచారం లభించింది దేవుడికి! ఎక్కడెక్కడినుండో చందాలు వచ్చాయి. అమోఘంగా తయారయ్యాయి. దేవాలయమూ, కోనేరూ, అన్నీనూ.

* * *

ప్రతి సంవత్సరంలో 'తిరణాల' జరుగుతుంది. ఐనాపురంలో. ఆంధ్రదేశం అంతటినుంచీ కాక పోయినా, ఆ రెండు మూడు జిల్లాల్లో మూల మూలలనుంచీ జనం వెళ్ళి మొక్కుబళ్ళు తీర్చుకొంటుంటారు స్వామిదగ్గర. ఇసకేస్తే రాలదు ఆ వారంరోజులూ! ఎక్కడా చోటు దొరక్క, చెట్లకిందా, అరుగులమీదా, వండుకు తిని కాలక్షేపం చేసిపోతారు యాత్రికులు.

క్రమంగా దేవాలయానికి సత్రం, అవీ కావలసి వచ్చాయి. నాయుడుగారు ఎకరన్నర దొడ్డీ అమ్మేశారు గజం పదిహేను రూపాయలచొప్పున. ప్రస్తుతం ఆయన కొడుకుచేత కంట్రాక్టులూ, అవీ చేయిస్తున్నారు. మొన్న నీమధ్య మంచి సినిమా హాలొకటి కట్టించారు. మంచియిళ్ళు కట్టించుకొని అందులో వుంటున్నారిప్పుడు.

రంగయ్యశ్రేష్ఠి తన స్థలమంతా మేడలువేసి రకరకాలైన కొట్లూ, తెరిపించాడు కొడుకులచేత. చాలా యిళ్లు అద్దెలకిచ్చాడు. అయిదొందలకు పైగా అద్దెలే వస్తాయ్. ఈ మధ్యనే భార్యతో యాత్రల కెళ్ళాడు.

ఆచార్యులుగారు చనిపోయి అప్పుడే ఏడాది అవుతోంది. పాపం అందరిచేతా మంచివాడని

పించుకొన్నాడు వూళ్ళో! పిల్లలందరికీ పెళ్ళిళ్ళు చేసివేశాడు. నిక్షేపంలా ఆరెకరాల మాగాణీ రెండెకరాల కొబ్బరితోటా సంపాదించాడు. ఆయన పెద్దకొడుకే ప్రస్తుతం అర్చకుడు.

ఆనాటి వూరుకాదు యిప్పుడు "ఐనాపురం" అంటే! అప్పటికీ యిప్పటికీ సంబంధమే లేదు. అసలు ఊళ్ళో ఎక్కడా పూరిల్లు కనిపించదిప్పుడు! జనాభా కూడా విపరీతంగా పెరిగిపోయింది. ఊరు పెరిగినట్టే ఊళ్ళో హైస్కూలూ, కాలేజీ, అన్నీ ఉన్నాయి. సర్వనాశనమైపోతూన్న గ్రామాన్ని ఆ స్వామి అవతరించి యింత వృద్ధిలోకి తెచ్చాడు అని, పెద్దవాళ్ళు ఎప్పుడైనా అనుకొంటూంటే, ఎగతాళిచేస్తారు యీనాటి కుర్రకారంతా.

రంగయ్యశ్రేష్ఠీ అప్పలనాయుడూ, తరచుగా కలిసికొరు. ఎప్పుడన్నా అనుకోకుండా తటస్థ పడితే భయం భయంగా నవ్వుకొంటూంటారు.

# "పెరటి చెట్టు"

"గోపి"

"ఊరంతా ఒకటి మనింట్లో మరోటి కుర్రాణ్ణి కాస్త కూకలెయ్యమనడానికి కూడా క్రమము, పద్ధతి కావాలంటే ఎల్లా చస్తానండీ! వాడు బొత్తిగా బడిఉేరిపోతున్నాడు, వెధవాయ్. వేటుగాడి మెత్తనచూచి లేడిమూడు కాళ్ళమీదే పరిగెత్తిదిట. అలావుంది మనసంగతి." అని. తన మామూలు తాపీతో కోర్టుకి తయారౌతూన్న న్యాయమూర్తి, సత్యనారాయణతో ఫిర్యాదు చేసింది యశోద.

"ఇన్ని వింటాంకానీ, ఇలాంటి కేసెక్కడా వినం. ఎవరో తెలీదు. అపచారం ఏవిటో అంత కన్నా తెలీదు..." అని నొక్కి నొక్కి, మాటల్ని రూపాయిల్లా ఖర్చు పెడుతూన్నట్లున్నాడు.

"చంటివాడు ఎడవాడు; ఇంట్లో ఉండేదే ఇద్దరు వెధవలు నా ప్రాణానికి, ఎడవెధవినిచూచి ఇప్పుడిప్పుడు అల్లరమొదలు మొదలెడుతున్నాడా చంటివాడుకాని, వాడంతట వాడల్లర చెయ్యడానికి హాలులేదు"

"హాలుకాదు "హాలత్"హిందీ పదంలే అది"

"నా బొంద "జరుంఃడిచి లొట్టలు. ఇంకెవరు చేస్తారో చెప్పండీ!"

"ఏంవిటి చెయ్యడం?"

"నాశ్రా...(నా నోరు తిన్నగారాదు)ఇప్పుడు చెప్పిందంతా ఏంవిటి?"

"నేనూ అదే అడుగుతున్నా ఏంవిటీ అని"

"అక్కర్లేని పనీలేదు, కావల్సిన పనీలేదు. ఊసుపోని మంగలి పిల్లితల గొరిగాడన్నట్లు, ఆవుని విప్పి, మండువాలోకి తోలాడు."

"ఎవరు?"

"ఎవరు"-ఎడవెధవ"

"తోత్తే?"

"తోత్తే-మడిబట్టలన్నీ మట్టిలోకీడ్చి, కడగడానికి పెట్టిన కప్పులు ప్లేట్లు కాళ్ళాచేతా కుమ్మి నాశనం చేసింది కలికంలోకి లేకుండా. తడిబట్టంతో వండనని, ఈ నెలతో మానేస్తానని, వెంకమ్మ నోటీసిచ్చింది..."

"అంటే ఆవుకి చేతులుకూడా ఉన్నాయన్న మాట!"

"ఆఁ! ఉన్నాయి..."

"అంటే ఆవు బట్టల్ని బురదలోకీడ్చి, కప్పులు ప్లేట్లు బద్దలుకొట్టింది. అంతేనా నువ్వనేది."

"ఆవుబద్దలు కొట్టిందీ అనేనా మీతీర్పు ఇంతకీ!"

"తీర్పువరకూ ఇంకారాందే, "అదేనా నీ వాదన" అని అడుగుతున్నానింకా!"

"ఒక మాటడుగుతాను కోప్పడకుండా చెప్పండీ, మీరే ఇలాగా? లేక అందరు న్యాయమూర్తులూ ఇంతేనా? ఎవరిచ్చారండీ మీకా జడ్జీపని? ఆ వెధవ నా కందడుగాని, ఒక్క నిముసంలో వాడి భాగరణచేదాన్ని."